క్లుప్తంగా

అయోధ్యకు తరలివెళ్లిన బాబాపూర్ భక్తులు


అయోధ్యకు బయలుదేరిన భక్తులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: అయోధ్యలో నూతనంగా ప్రతిష్ఠించిన బాలరాముడి ఆలయాన్ని దర్శించుకునేందుకు శనివారం మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన 20 మంది భక్తులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామంలోని హనుమాన్ ఆలయంలో అర్చకులు తిరుపతిచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు భక్తులను గ్రామశివారు వరకు భజనలు చేసుకుంటూ సాగనంపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

తిర్యాణి: వాహనాల తనిఖీల్లో ద్విచక్రవాహనంపై అక్రమంగా తరలిస్తున్న 102 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శనివారం మండలంలోని గిన్నెదరి గ్రామశివారులోని గుడిపేట గ్రామానికి వెళ్లే దారిలో వాహన తనిఖీలు చేస్తుండగా టేకం భీంరావు, గెడం సచిన్ అనే ఇద్దరు వ్యక్తులు పోలీసు వాహనాన్ని గుర్తించి వారి వెంట తీసుకొచ్చిన చేతిలోని సంచిని పక్కన పడేశారు. గమనించిన పోలీసులు అనుమానంతో సంచిని పరిశీలించగా గంజాయి లభ్యమైనట్లుగా పేర్కొన్నారు. గంజాయి విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లుగా నిందితులు ఒప్పుకోవడంతో పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఫోన్ అప్పగింత

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన అశోక్ ఫోన్ గత నెల రోజుల క్రితం దొంగిలించబడింది. ఫోన్ దొంగతనం జరిగినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా.. పోలీసులు ప్రత్యేకయాప్‌తో మెదక్‌లో గుర్తించి ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. శనివారం భీంపూర్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది అశోక్‌కు ఫోన్ అందజేశారు. సిబ్బంది సంతోష్, ముకుంద్, ఉత్తం ఉన్నారు.

జెడ్పీటీసీ వాహనం తనిఖీ

తలమడుగు: మండలంలోని లక్ష్మీంపూర్ చెక్‌పోస్ట్ వద్ద జెడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి వాహనాన్ని పోలీసులు శనివారం తనిఖీ చేశారు. మాల్కుపల్లి, సోనపూర్, లల్‌ఘడ గ్రామాలకు వెళ్తుండగా.. లక్ష్మీంపూర్ గ్రామ సమీపంలోని తనిఖీ చేశారు. మద్యం, డబ్బు రవాణాను అరికట్టేందుకు తనిఖీ చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి

నేరడిగొండ: ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంపీడీవో రాజ్‌వీర్‌లు అన్నారు. శనివారం మండలంలోని రోడ్‌సవర్గాం, చించోలి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటర్ల చైతన్యం కోసం ఫ్లెక్సింగ్‌లు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మణ్, ఆర్‌ఐ నాగోరావు, సీనియర్ అసిస్టెంట్ మీరాబాయి, పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, జాదవ్ కల్యాణి మహేందర్, జంగు పాల్గొన్నారు.

పరీక్షాకేంద్రం కొనసాగించాలి

బేల: బేలలోని కీర్తన డిగ్రీ కళాశాల విద్యార్థులకు పరీక్షా కేంద్రాన్ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగించేలా చూడాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు శనివారం కళాశాల ప్రిన్సిపాల్ వరప్రసాద్ రావు, విద్యార్థులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. బేలలో ప్రశాంతంగా కొనసాగే డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని కాకతీయ యూనివర్సిటీ అధికారులు తొలగించడం సరికాదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ రమేశ్‌తో పాటు అదనపు పరీక్షల నియంత్రణ అధికారి తిరుమల దేవితో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

బోథ్ మార్కెట్‌లో రైతుల నిరసన

బోథ్: బోథ్ మార్కెట్‌యార్డులో రైతులు శనివారం నిరసన తెలిపారు. ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా జొన్నలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల జొన్న పంట దిగుబడి వచ్చిందని, ప్రభుత్వం మాత్రం ఎకరానికి 8 క్వింటాళ్ల 85 కిలోల మాత్రమే కొనుగోలు చేస్తామనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గొర్ల రాజు యాదవ్, అనిల్ అప్ప, సంజీవ్, భీంరావ్, రవీందర్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

బోథ్: బోథ్ మండల కేంద్రంలో శనివారం శబరిమాత ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో భక్తులు శోభాయాత్ర చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అధ్వానంగా ఎడమ కాలువ



అడ ప్రాజెక్టు నుంచి వచ్చే ప్రధాన ఎడమ కాలువకు చిన్న వాంకిడి సమీపంలో గల చిక్లీ వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. రెండేళ్ల క్రితం వచ్చిన వరదలకు ఈ ప్రదేశంలో కాల్వ కోతకు గురైంది. వరద ధాటికి భారీగా గండి ఏర్పడటంతో ఏడాది పాటు కాలువకు సాగునీటి సరఫరా నిలిపివేశారు. రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాల మేరకు తాత్కాలికంగా సాగు నీరు సరఫరా అయ్యేలా కోతకు గురైన చోట మొరంతో పనులు చేశారు. గతేడాది కురిసిన వర్షాలకు మళ్లీ కొంతవరకు కాల్వ దెబ్బతింది. కాగా భారీ వర్షాలు కురిస్తే భారీ నష్టం తప్పదని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.


వాంకిడి సమీపంలో కాలువకు ఏర్పడిన రంధ్రం

- దెబ్బతిన్న అడ ప్రాజెక్టు ప్రధాన కాలువ
- పలుచోట్ల కాలువకు రంధ్రాలు
- మరమ్మతులకు నిధులు కరువు
- భారీ వర్షాలు కురిస్తే గండ్లు పడే ప్రమాదం
- ఆందోళనలో ఆయకట్టు రైతులు

వాంకిడి: కుమురంభీం (అడ) ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా మారింది. కాలువ పొడవున సిమెంట్ లైనింగ్ ఊడిపోయింది. పలుచోట్ల కాలువకు రంధ్రాలు ఏర్పడ్డాయి. మరి కొన్నిచోట్ల వరదలకు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. అధికారులు కాలువకు మరమ్మతులు చేయడంలో విఫలమవుతుండటం, ప్రజాప్రతినిధులు పట్టింపులేకుండా వ్యవహరిస్తుండడంతో ఆయకట్టు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వర్షాలకు వరదలు పోటెత్తితే కాలువ పూర్తిగా దెబ్బతిని గండ్లు పడే ప్రమాదం ఉందని వాపోతున్నారు. మరమ్మతు పనులకు అనుకూలమైన వేసవి కాలంలో పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

కాలువ వివరాలు..

అడ ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ ఆయకట్టు 39వేల ఎకరాలు ఉంది. మండలంలోని నవేగూడ, ఇందాని, ఖిరిడి, సరాండి, వాంకిడి, ఖమాన, జంబుల్‌ధరి, లక్ష్మీపూర్, వెల్గీ, కనర్‌గాం గ్రామ పంచాయతీల మీదుగా ఆసిఫాబాద్ మండలంలోని గుండి, భీంపూర్, తదితర గ్రామాలతో పాటు, కాగజ్‌నగర్‌లోని పలు ప్రాంతాల వరకు మొత్తం 65 కిలోమీటర్ల పొడవు గల కాలువ ద్వారా సాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ కాల్వ నుంచి వెలువడే ఉప కాలువలతో కొన్ని చిన్నపాటి చెరువుల్లో నీరు చేరుతుంది. సాగు నీటిని ఎడమ కాలువ ద్వారానే విడుదల చేస్తుండగా కుడి కాలువ పనులు పూర్తి కాలేదు. ప్రధాన ఎడమ కాలేవకు పలు ఉప కాలువలు ఏర్పాటు చేసి రైతులకు సాగు నీరు అందిస్తున్నారు. కాలువకు పలుచోట్ల మరమ్మతులు చేపట్టాల్సి ఉండటంతో చివరి ఆయకట్టు వరకు నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు.


సిమెంట్ లైనింగ్ లేని కాలువ

నెల రోజులే సమయం..

కాలువ మరమ్మతులకు వేసవి కాలం అనుకూలంగా ఉంటుంది. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పనులు చేపడితేనే ప్రమాదాన్ని అరికట్టవచ్చు. కాల్వకు అనేక చోట్ల మరమ్మత్తులు చేపట్టాల్సి ఉంది. వేసవి కాలం మరో నెలరోజులతో ముగుస్తుండడంతో ఉన్నతాధికారులు దృష్టి సారించి కాలువకు ప్రధాన ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. మూడేళ్లుగా కాలువకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టకపోవడంతో కాల్వ పూడికతో పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ప్రాజెక్టు నుంచి చివరి ఆయకట్టు వరకు చూస్తే అనేక ప్రదేశాల్లో రంధ్రాలు ఏర్పడి, కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వాలు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ సమస్యపై ప్రాజెక్టు డీఈ దామోదర్‌ను వివరణ కోరగా ప్రతిపాదనలు పంపించామని, నిధులు విడుదల కావాల్సి ఉందని తెలిపారు.

మరమ్మతులు చేపట్టాలి



2021 –22లో వచ్చిన వరదలకు మా గ్రామ సమీపంలోని కాల్వకు భారీగండి ఏర్పడింది. దీంతో ఏడాది పాటు సాగునీటి సరఫరా నిలిపివేశారు. తర్వాత చేపట్టిన మరమ్మతు పనులు సైతం పకడ్బందీగా లేకపోవడంతో మళ్లీ కాలువ కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. అధికారులు మరమ్మతులు చేపట్టాలి.

– వడ్గురె లహను, రైతు, చిన్నవాంకిడి

నీటి సరఫరా లేదు



ఏళ్లుగా కాల్వకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రధాన ఎడమ కాలువ అధ్వానంగా మారింది. పలుచోట్ల సిమెంట్ లైనింగ్ లేదు. అనేక ప్రదేశాల్లో కాల్వకు రంధ్రాలు ఏర్పడ్డాయి. దీంతో ఉప కాలువలకు నీరు సరఫరా అవడం లేదు. వేసవిలో, వర్షాకాలం చివరిరోజుల్లో సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– వడ్గురె మణిలాల్, రైతు

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మికులు

రెబ్బెన: మేడేను విజయవంతం చేయాలని ఎస్‌సీడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం అన్నారు. శనివారం మండలంలోని గోలేటిలో 138మేడేకు సంబంధించి పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం హక్కుల కోసం పోరాడి అమరులైన కార్మికుల కోసం మే1న సంఘం నివాళులర్పిస్తుందన్నారు. కార్మికులు మే డేను ఘనంగా నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తిరుపతి, పోశం, కార్మికులు చందు, రాణి, సావిత్రి పాల్గొన్నారు.

నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయాలి


నిసానిలో నర్సరీ పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: మొక్కలకు నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో కృష్ణారావు అన్నారు. శనివారం మండలంలోని నిసాని, సాంగ్వి, ఖైరీ, గోండ్‌గూడ, సావర్‌ఖెడా గ్రామ పంచాయతీలను ఆయన సందర్శించారు. ఆయా గ్రామాల్లో ఉన్న నర్సరీలను పరిశీలించారు. నర్సరీల్లో ఉన్న మొక్కలకు ప్రతీరోజు నీళ్లు పోసి ఎండల నుంచి సంరక్షించాలన్నారు. అనంతరం కూలీలు పనులు చేస్తున్న ప్రదేశాలకు వెళ్లి పనులు పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, సెక్రటరీలు, విలాస్, సతీశ్, టీఏలు, ఎఫ్‌ఏలు ఉన్నారు.

శ్మశానవాటికలకు మరమ్మతులేవి..?


లగ్గాంలో కొట్టుకుపోయిన శ్మశానవాటిక గేటు


చౌకలో వరదలకు ధ్వంసమైన శ్మశాన వాటిక

దహెగాం: గత రెండేళ్ల భారీ వర్షాలకు పెద్దవాగు ఉప్పొంగడంతో వరదల ధాటికి మండలంలోని లగ్గాం, చౌక గ్రామాల శ్మశానవాటికలు ధ్వంసమయ్యాయి. కాగా ఇప్పటివరకు వాటికి మరమ్మతులు చేయించడంలో అధికారులు విఫలమయ్యారు. లక్షల రూపాయలు వెచ్చించి వరదలు సంభవించే ప్రాంతంలో శ్మశానవాటికలు నిర్మించి నిధులు వృధా చేశారని స్థానికులు విమర్శిస్తున్నారు. కాగా అధికారులు పట్టించుకోకపోవడంతో శ్మశానవాటికలు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వరదల ధాటికి కొట్టుకుపోయిన, ధ్వంసమైన శ్మశాన వాటికలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

తవ్వారు.. వదిలేశారు..!



దహెగాం: మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయం సమీపంలో డ్రెయినేజీ నిర్మాణంలో భాగంగా రెండు నెలల క్రితం నాలీ తవ్వారు. కానీ ఇప్పటికీ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నాలీ తవ్వి వదిలేయడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి డ్రెయినేజీ నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భగ్గుమంటున్న భానుడు..!

- రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు
- 15 మండలాలకు ఆరెంజ్ అలర్ట్
- అత్యధికంగా తిర్యాణిలో 44.6
- నేడు, రేపు మరింత ఎండలు



శనివారం నమోదైన పగటి ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్‌లో..)

ప్రాంతం	గరిష్ఠం
తిర్యాణి	44.6
ఆసిఫాబాద్	44.5
జంబుగా	44.4
కాగజ్‌నగర్	44.4
ఎల్కపల్లి	43.8
వంకులం	43.7
దహెగాం	43.3
బెజ్జూర్	43.1
కౌటాల	42.8
కుంచవెల్లి	42.8

కౌటాల: జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. ఎండ వేడిమి, వడగాలులు, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే సూరీడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. సాయంత్రం 7 గంటల వరకు వేడి తగ్గడం లేదు. శుక్రవారం తిర్యాణిలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ తీవ్రతకు జనం ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులు, చౌరస్తాలు జనసంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. కూలీలు, చిరువ్యాపారులు ఎండకు అల్లాడుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, క్రీడాకారులు, ఎండలో పని చేసేవారికి ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఆరెంజ్ జోన్..

ప్రమాదకరస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్న మండలాలను ఆరెంజ్ జోన్‌లో ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. ఆరెంజ్ జోన్‌లో జిల్లాలోని 15 మండలాలు ఉండడం గమనార్హం. జిల్లాలోని తిర్యాణి, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, దహెగాం, కౌటాల మండలాల్లో పగటి ఉష్ణోగ్రతలు హెచ్చరిక జోన్‌కు సమీపంగా నమోదవుతున్నాయి. రానున్న రెండు, మూడు రోజులు పొడి వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది.

అల్లాడుతున్న ప్రజలు

పెరిగిన ఉష్ణోగ్రతలతో జనం అత్యవసరమైతే తప్పా బయటకు రావడం లేదు. ఇక రోజువారీ కూలీలు, ఉపాధికూలీలు అల్లాడుతున్నారు. కొందరు 11 గంటల లోపే పనులు ముగించుకొని ఇంటిబాట పడుతున్నారు. ఎండలు మండుతుండడంతో చర్చిల్లో ఆదివారం ప్రార్థన సమయాలను ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తున్నారు. చిరువ్యాపారులు తప్పని పరిస్థితిల్లో గొడుగు నీడలో అమ్మకాలు సాగిస్తున్నారు. పాదచారులు, వాహనాలపై వెళ్లేవారు స్కార్ఫ్‌లు ధరిస్తున్నారు. ఎండ నుంచి ఉపశమనానికి శీతలపానీయాలు, కొబ్బరి నీళ్లు తాగుతున్నారు.

వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- నీళ్లు సాధ్యమైనంత ఎక్కువ మోతాదులో తాగాలి.
- ఆల్కాహాల్, కాఫీలకు దూరంగా ఉండాలి.
- చల్లని నీటితో స్నానం చేయాలి.
- వదులైన నూలు దుస్తులు వాడాలి.
- డోర్లన్నీ మూసిన కార్లలో కూర్చోవద్దు.
- నిలువ ఉండే శీతల పానీయాలకు దూరంగా ఉండాలి.
- బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు తప్పనిసరిగా తీసుకెళ్లాలి.
- పిల్లలు సాయంత్రం 5 గంటల వరకు బయటకు వెళ్లొద్దు.

మంత్రి సీతక్కకు ఘన స్వాగతం


కాగజ్‌నగర్‌లో అన్నం వడ్డిస్తున్న మంత్రి సీతక్క

కాగజ్‌నగర్‌రూరల్‌: సిర్పూర్ నియోజకవర్గానికి వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కాగజ్‌నగర్ బస్టాండ్ ఎదురుగా నిర్వహిస్తున్న కోనేరు నిత్యాన్నదాన సత్రంలో భోజనం చేసేందుకు వచ్చిన వారికి మంత్రి సీతక్క భోజనం వడ్డించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం చాలా అదృష్టమన్నారు.

కెరమెరి: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు కెరమెరి మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే భారీ బహిరంగ సభకు మంత్రి సీతక్క, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ విష్ణునాథన్, రోహిత్ చౌదరి, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ హాజరువుతున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

కౌటాల: ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని మంత్రి సీతక్క అన్నారు. శనివారం సాయంత్రం కౌటాలలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నివాసంలో మాట్లాడారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని తెలిపారు. మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ వసంత్‌రావు, మధుకర్, రాందాస్ పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి’

తిర్యాణి: బీఆర్‌ఎస్‌తోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి అన్నారు. శనివారం మండలంలోని మొర్రిగూడ, లోయ, కొత్తగూడ, లింగిగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ప్రజలు బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలపాలని పేర్కొన్నారు. మండలానికి చెందిన బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుకు పార్లమెంట్ ఎన్నికల్లో అవకాశం కల్పించి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ వెడ్మ కమల, నాయకులు తోట లచ్చన్న, ముక్కెర సరిత తదితరులు ఉన్నారు.

‘ప్రజల ఆకాంక్ష నుంచి పుట్టింది బీఆర్‌ఎస్’

ఆసిఫాబాద్: ప్రజల ఆకాంక్ష నుంచి పుట్టిన పార్టీ బీఆర్‌ఎస్ అని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ భవన్ వద్ద ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కలిసి శనివారం పార్టీ జెండా ఆవిష్కరించారు. అంబేద్కర్ చౌక్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆశలను ఆధారంగా చేసుకొని పార్టీ ఆవిర్భవించిందన్నారు. జెడ్పీటీసీలు ధ్రుపదాబాయి, అజయ్‌కుమార్, ఎంపీపీ సౌందర్య, సింగిల్‌విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, మైనార్టీ నాయకుడు అబ్దుల్లా నాయకులు పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శనివారం బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యాలయం ఎదుట పార్టీ జెండా ఎగురవేశారు. సీనియర్ నాయకులు నక్క శంకర్, ఉమా మహేశ్, నాగపూరే బండు, దుర్గం వెంకటేశ్, దోని రవి, శంకర్, సాయి, శంకరయ్య, ప్రశాంత్, తదితరులు ఉన్నారు.


నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న విశ్వప్రసాదరావు

ఆసిఫాబాద్: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు పట్టణంలోని మార్కెట్‌లోని దుకాణాలు, వ్యాపార సముదాయాల్లో ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి, కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.